ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 57 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం 28 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02

## సామర్థ్యాలు పెంచుకుందాం..!

## కలిసి సాగుదాం

- మిషన్ కర్మయోగిలో ఏపీ జాతీయ బెంచ్‌మార్కుగా నిలవడం గర్వకారణం
- సాంకేతిక ఆధారిత అభ్యాసంతో మెరుగైన పాలన
- పురోగతిని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు అడుగులు వేయాలని 'ఎక్స్' వేదికగా పిలుపు
- ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు సాధన సప్తాహం పేరుతో జాతీయ అభ్యాస వారోత్సవాలు
- 'ప్రభుత్వ ఉద్యోగుల్లో పాలనా సామర్థ్యాల్ని బలోపేతం చేసేందుకె సాధన సప్తాహం
- రామరాజ్య ఆశయాల్ని ముందుకు తీసుకెళ్తా



మిషన్ కర్మయోగిలో ఆంధ్రప్రదేశ్ జాతీయ బెంచ్‌మార్కుగా నిలవడం గర్వకారణమని.. సాంకేతిక ఆధారిత అభ్యాసంతో మెరుగైన పాలన అందించవచ్చనేందుకు ఇదే నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పురోగతిని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు అడుగులు వేయాలని 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు.

## 'టీమ్ ఇండియా'గా పనిచేద్దాం

- సహకారం, సమన్వయమే మన బలం
- సమాచారం పంచుకోవాలి, ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవాలి
- ప్రస్తుత సవాల్‌ను కచ్చితంగా అధిగమిస్తాం
- ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం చాలా ముఖ్యం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వర్చువల్ భేటీ
- ఎరువులపై ముందస్తు ప్రణాళిక అవసరం

పశ్చిమాసియా పరిణామాలు, ప్రపంచ అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మన దేశంలో ఆర్థిక, వాణిజ్య స్థిరత్వాన్ని కొనసాగించడానికి, ఆహార భద్రతను విఘాతం కలగకుండా చూడడానికి, ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు, పరిశ్రమలు, సప్లై చైన్లను బలోపేతం చేయడానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. ఆయన శుక్రవారం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. తాజా పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. ఆయా రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలను సమీక్షించారు. రాబోయే రోజుల్లో ఎలాంటి అనూహ్య పరిస్థితులు ఎదురైనా సరే ఎదుర్కోవడానికి మనమంతా 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని మోదీ రాష్ట్రాల సీఎంలతో భేటీ కావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సవాల్‌ను మనం కచ్చితంగా అధిగమిస్తామని ధీమా వ్యక్తంచేశారు. కోవిడ్--19 మహమ్మారి ఉ ధృతి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ఆ సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని గుర్తుచేశారు. ప్రతికూల పరిణామాలను ఎదుర్కొన్న అనుభవం మనకు ఉందన్నారు.

## జనజీవనంపై యుద్ధం

అన్ని రంగాలపై 'పశ్చిమాసియా' ప్రభావం
హోటళ్లు, పరిశ్రమలు సతమతం
ఆలయాల్లో ప్రసాదాలపై పరిమితులు
నిర్మాణ రంగంలోనూ ఒడుదొడుకులు
గ్యాస్ కోసం బంకు వద్ద బారులుదీరిన ఆటోలు, కార్లు
స్టీల్, పైపులు, సిమెంటు, విద్యుత్ తీగలు ప్రియం
సికింద్రాబాద్ గణేశ్ గుడిలో ఆగిన అన్నదానం
సామిల్లులకు భారీగా డిమాండ్

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం ఆ దేశాలకే పరిమితం కాలేదు. అక్కడి చమురు మంటల సెగ మన దేశానికి తగులుతోంది. మన రాష్ట్రాన్ని... వ్యాపారాన్నీ, మన ఇంటినీ ఇక్కట్ల పాల్జేస్తోంది. మొదట వాణిజ్య గ్యాస్ కొరతతో మొదలైన సమస్య క్రమంగా అనేక రంగాలకు విస్తరిస్తోంది.

## పెరుగుతున్న ఉద్రిక్తతలు

- చర్చలంటూనే అమెరికా, ఇజ్రాయిల్ దాడులు
- రెండు దేశాలకూ ఇరాన్ గట్టి సమాధానం
- గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై స్ట్రైక్స్
- హోర్ముజ్‌లో పాకిస్తాన్ జెండాతో అమెరికాకు చమురు ట్యాంకర్
- క్షిపణులతో దాడి చేసిన ఐఆర్‌జీసీ
- మరో పదిరోజులు యుద్ధానికి విరామం : ట్రంప్ ప్రకటన
- ఇజ్రాయిల్ సైన్యం కుప్పకూలే ప్రమాదం : ఐడీఎఫ్ చీఫ్ హెచ్చరిక
- అవి అమెరికాకు ఇచ్చిన కానుకలు : ట్రంప్
- ఐక్యరాజ్యసమితికి ఇరాన్ లేఖ
- ఇరాన్‌పై యూఎస్ రహస్య ఆయుధం
- పెరుగుతున్న మృతులు
- దాడులు మరింత తీవ్రం : ఇజ్రాయిల్
- పాకిస్తాన్ జెండాతో అమెరికాకు ఆయిల్




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు, హెచ్చరికలను ఇరాన్ ఏ మాత్రం లెక్క చేయట్లేదు. ప్రతిదాడులతో గట్టి సమాధానం చెప్తోంది. టెహ్రాన్‌లో బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. పశ్చిమ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై కూడా దాడులు చేశామని ప్రకటించింది. ఇక ఇరాన్.. యూఎస్ మిత్ర దేశాలపై విరుచుకుపడుతోంది. శుక్రవారం కూడా ఈ దాడులను కొనసాగించింది.

## ఘనంగా సీతారాముల కళ్యాణం

- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు
- రూ.351 కోట్లతో ఆలయ తొలిదశ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన
- హాజరైన మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల, సురేఖ, శ్రీహరి
- భద్రగిరికి పోటెత్తిన భక్తులు..కిక్కిరిసిన మిథిలా స్టేడియం
- నేడు శ్రీరామ పట్టాభిషేకం..హాజరుకానున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





## సూర్యుడి భగభగ

- మండిపోతున్న ఎండలు
- క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత
- ఉదయం 10 గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి
- ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజల భయాందోళన
- ఏప్రిల్ రాకముందే రాష్ట్రంలో వడగాలులు
- తీవ్ర ప్రభావం చూపే మండలాలు
- నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి
- ఉత్తరాంధ్రలో తీవ్ర వడగాల్పుల హెచ్చరిక
- 16 మండలాల్లో ఎక్స్‌ట్రీమ్ హీట్ అలర్ట్
- 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఎండదెబ్బ నుంచి రక్షణకు కీలక సూచనలు
- ఏపీకి వడగాల్పుల హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు అప్పుడే నిప్పులు చెరుగుతున్నాయి. మార్చి నెల ముగియకముందే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తీవ్ర వడగాల్పుల హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా రేపు (శనివారం, మార్చి 28) ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ, విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, రాజాం, తెర్లాం వంటి పలు మండలాలు, అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, సాలూరు వంటి ప్రాంతాల్లో ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది.

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ పన్ను తగ్గింపు

- ఆయిల్ కంపెనీలకే ప్రయోజనం వినియోగదారులకు పరోక్ష లబ్ధి
- లీటర్‌పై రూ.10 చొప్పున కోత పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై సున్నాకు చేరిన ఎక్సైజ్ డ్యూటీ
- రిటైల్ ధరలు యథాతథం
- ఎన్నికల కోసమే ఈ స్టంట్: కాంగ్రెస్
- డీజిల్‌పై రూ 21.50, ఏటీఎఫ్‌పై రూ.29.50 చొప్పున విండ్‌ఫాల్ ట్యాక్స్



# సూర్యుడి భగభగ

రేపు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 68 మండలాల్లో సాధారణ వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉంది. గుంటూరులో 16, పల్నాడులో 21, ఎన్టీఆర్ జిల్లాలో 9 మండలాలతో పాటు కృష్ణా, ఏలూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వేడి గాలుల తీవ్రత ఎక్కువగా ఉ ఒడనుంది. ఇక రాయలసీమ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 40 నుండి 42 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉ ఒదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం నాటికి ఈ తీవ్రత మరింత పెరిగి, దాదాపు 18 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి. శుక్రవారం నమోదైన గణాంకాలను పరిశీలిస్తే ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. నంద్యాల జిల్లా గుల్లదుర్తిలో గరిష్టంగా 42.1లీజ, కడప జిల్లా కమలాపురంలో 42లీజ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే పల్నాడు, తిరుపతి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కూడా పారలు 41 డిగ్రీలను దాటేశాయి. తీర ప్రాంత జిల్లాలైన కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరిలో కూడా 40 డిగ్రీల పైచిలుకు ఉష్ణోగ్రతలు నమోదవ్వడం గమనార్హం. ఈ అసాధారణ ఉష్ణోగ్రతల వల్ల జనజీవనం అస్తవ్యస్తమయ్యే అవకాశం ఉందని, మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఎండదెబ్బ నుంచి తమను తాము కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా గొడుగు, టోపీ లేదా తలకి టవల్ చుట్టుకోవాలని, శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాటన్ దుస్తులు ధరించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు ఎండ పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, వేడి గాలి నేరుగా చెవుల్లోకి వెళ్లకుండా చూసుకోవాలని హితవు పలికారు. తగినంత నీరు, మజ్జిగ వంటి పానీయాలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# 'టీమ్ ఇండియా'గా పనిచేద్దాం

తాజా సంక్షోభం పట్ల మన ప్రతిస్పందన వేగంగా ఉండాలంటే సమాచారం పంచుకోవాలని, ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రాలు సైతం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. సప్లై చైన్లు సజావుగా పనిచేసేలా చూడాలని, సరుకుల అక్రమ నిల్వలు, రవాణా, అక్రమార్జనపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఇంధనం, సరుకుల సరఫరాలో అంతరాయాలను నివారించడానికి పరిపాలనా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్యావసరాల సరఫరా పట్ల ఆందోళన తలెత్తకుండా ప్రజలకు వాటిని అందుబాటులో ఉంచాలని చెప్పారు.

**ఎరువులపై ముందస్తు ప్రణాళిక అవసరం**

పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయని, అందుకే నిరంతర పర్యవేక్షణ అవసరమని ప్రధాని మోదీ వెల్లడించారు. కేంద్రం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం ప్రతిరోజూ పరిస్థితులను సమీక్షిస్తోందని పేర్కొన్నారు. రైతాంగానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు ముందు ఎరువుల నిల్వ, పంపిణీని పర్యవేక్షించడానికి ముందస్తు ప్రణాళిక అవసరమని స్పష్టంచేశారు. ప్రజల్లో భయాందోళనకు తావులేకుండా వారికి ఎప్పటికప్పుడు సరైన సమాచారాన్ని అందించాలన్నారు. తప్పుడు సమాచారం, వదంతుల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తేల్చిచెప్పారు. అలాగే నౌక రవాణా, నిత్యావసర వస్తువుల సరఫరా, సముద్ర కార్యకలాపాలకు సంబంధించి తలెత్తే సవాళ్లను పరిష్కరించేందుకు సరిహద్దు, తీరప్రాంత రాష్ట్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వివరించారు. ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం చాలా ముఖ్యమని ప్రధానమంత్రి ఉద్బోధించారు. సహకారం, సమన్వయమే మన బలమని ఉద్ఘాటించారు. ఈ వర్చువల్ సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షాతోపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, జమ్మూకశ?మర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ, అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమా ఖండూ తదితరులు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల సీఎంలు పాల్గొనలేదు.

# ఘనంగా సీతారాముల కళ్యాణం

భద్రాచలంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, గీత దంపతులు తానీషా కాలం నాటి ఆనవాయితీని కొనసాగిస్తూ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను కళ్యాణ క్రతువు నిమిత్తం సమర్పించారు. దీనికి ముందు సీఎం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.586 కోట్లతో చేపట్టే ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా రూ.351 కోట్లతో పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, దనసరి సీతక్కతో కలిసి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గోదావరి పుష్కరాల నాటికి తొలి దశ పనులను పూర్తి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ సందర్భంగా ప్రకటించారు.

**మిథిలా స్టేడియం కళ్యాణ శోభితం:** భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించిన శ్రీ సీతారామస్వామి తిరుకళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర నలుమూలలు, వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శుక్రవారం ఉదయం 9:30 గంటల తర్వాత శంకు, చక్ర, ధనుర్బాణాలను ధరించి సీతారామ, లక్ష్మణ సమేతంగా ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీలో మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం గావించి కల్యాణం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలను సీతారాములకు ధరింప చేశారు. భక్త రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చల హారం రామయ్యకు అలంకరించారు. లక్ష్మణుడికి రామమాడ ధరింపజేశారు. చైత్రశుద్ధ నవమి అభిజిత్ లగ ముహూర్తం రాగానే వధూవరులైన సీతారాముల తలలపై జీలకర్ర, బెల్లం ఉంచారు. అనంతరం శ్రీరామదాసు చేయించిన మూడు బొట్లు ఉన్న మంగళసూత్రానికి పూజలు నిర్వహించి, ఆ తాళిని సీతమ్మ వారి మెడలో కట్టడంతో కల్యాణ క్రతువులో కీలక ఘట్టం ముగిసింది. ముత్యాలు కలిపిన, గోటితో ఒలిచిన తలంబ్రాలను వధూవరులైన సీతారాములపై పోశారు. సీతారాములకు తాత్కాలిక నివేదన ఇచ్చి, బ్రహ్మముడి వేసి మంగళహారతి అందించారు. తర్వాత సీతారాములను వేడుకగా పల్లకీలో భద్రాచలం వీధుల్లో ఊరేగించి ఆలయంలోనికి తీసుకెళ్లారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహిస్తారు. దీనికి రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా హాజరుకానున్నారు.

**ఆలయ పునరుద్ధరణ కానుక :** ప్రతి ఏటా శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించటం ఆనవాయితీ. ఈసారి వీటితో పాటుగా రూ.351 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టడంపై అర్చక స్వాములు ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. '1950–58 మధ్యకాలంలో తొలిసారి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. 1954లో పునరుద్ధరణ సంఘం ఏర్పాటైంది. 1968లో పునరుద్ధరణకు సంబంధించిన ఆవిష్కరణలు చేశారు. తిరిగి మళ్లీ ఇప్పుడు రూ.586 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపడుతున్న ప్రభుత్వానికి సకల శుభాలు కలగాలి' అని అర్చకులు ప్రకటించారు. ఈ నిధులతో టెంపుల్ కాంప్లెక్స్ విస్తరణ, అదనపు పుష్కరఘాట్లు వంటివి ఏర్పాటు చేస్తారు. కాగా, రూ.351 కోట్లతో భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయ విస్తరణ తొలిదశ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా రూ.75 కోట్లతో గోదావరి ఘాట్ అభివృద్ధి, రూ.180 కోట్లతో ఆలయ విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, రూ.96 కోట్లతో ఆలయ పరిసరాల అభివృద్ధి పనులు నిర్వహిస్తారు.

**అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు :** సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తుల కోసం దేవస్థానంతోపాటు జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం మిథిలా స్టేడియాన్ని సెక్టార్లుగా విభజించారు. వేసవి కావడంతో కల్యాణ వేదిక దగ్గర పందిళ్ల కిందట మిస్ట్ ఫాగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రధాన రహదారి నుంచి ఆలయ ప్రాంగణం వరకు చలువ పందిళ్లు వేశారు. తోరణాలు, విద్యుత్ వెలుగులతో రామాలయ పరిసరాలను అలంకరించారు. భారీగా వచ్చిన భక్తులు శ్రీ సీతారామ చంద్రస్వామి దర్శనం కోసం బారులు తీరారు. భక్తుల కోసం అన్న ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐడీడీఏ పీఓ బి. రాహుల్ నేతృత్వంలో సుమారు 4000 మందికిపైగా సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూసుకున్నారు. వీరిలో 2వేల మంది పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, సీఎం సలహాదారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమిషనర్ హన్మంతరావు, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మణాల్ శ్రేష్ఠ, మంత్రి పొంగులేటి సతీమణి మాధురి, భట్టి సతీమణి నందిని, ముఖ్యమంత్రి కూతురు, అల్లుడు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనజీవనంపై యుద్ధం

సాధారణ గృహస్థులు, వ్యాపారులు, కార్మికులు, కాంట్రాక్టర్లు, కంపెనీలతో సహా ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేస్తోంది. చమురు సంస్థలు బల్క్ బుకింగ్‌లో డీజిల్ ధరల్ని పెంచేశాయి. నగదు చెల్లించే బంకులకే ట్యాంకర్లు పంపుతున్నాయి. పెట్రోల్ కోసం వాహనదారులు బంకుల దగ్గర నిరీక్షిస్తున్నారు. సీఎన్జీతో నడిచే ఆటోవాలాల కష్టాలు రెట్టింపవుతున్నాయి. గ్యాస్‌పై ఆధారపడిన పరిశ్రమలు ఉత్పత్తి తగ్గించుకోవాల్సి వస్తోంది. వ్యాపారులూ నగదు చెల్లించే వారికే నిర్మాణ సామగ్రిని, ఇతర వస్తువుల్ని విక్రయిస్తున్నారు. నిర్మాణరంగంలో ఇప్పటికే టైల్స్, స్టీల్, అల్యూమినియం, సిమెంటు, కరెంటు వైర్ల ధరలు పెరిగాయి. నిర్మాణ సామగ్రి వ్యాపారులు సైతం చమురు సంస్థల మాదిరిగానే నగదు ఇచ్చేవారికే సరకు ఇస్తున్నారు. దీంతో చిన్న కాంట్రాక్టర్లు, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి. ముఖ్యంగా గ్యాస్‌పై ఆధారపడే టైల్స్ పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గుజరాత్‌లోని మోర్బి 'భారతదేశ సిరామిక్ రాజధాని'గా పేరొందిన ప్రాంతం. అక్కడ దాదాపు 1000 వరకు సిరామిక్, ఇతర టైల్స్ పరిశ్రమలు ఉంటాయి. వాణిజ్య గ్యాస్ కొరతతో 50–60% పరిశ్రమలు మూతపడ్డట్లు సమాచారం. ఫలితంగా టైల్స్ ధరలు పెరిగాయి. మనరాష్ట్రంలోని నిర్మాణ రంగంలో వాడే టైల్స్ నాలుగింట మూడొంతులకుపైగా మోర్బి నుంచే వస్తా. అక్కడ సగం పరిశ్రమలు మూతబడటంతో ఇక్కడికి టైల్స్ రాక నిలిచిపోయింది. ఇప్పటికే స్టాక్ ఉన్నవారు మాత్రమే పనులు కొనసాగిస్తుండగా, కొత్తగా టైల్స్ అవసరమైన వారు పనులు నిలిపివేస్తున్నట్లు సమాచారం.

**సికింద్రాబాద్ గణేశ్ గుడిలో ఆగిన అన్నదానం**

గ్యాస్ సరఫరాపై పరిమితులతో రాష్ట్రంలోని పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం ప్రభావితమైంది. సికింద్రాబాద్‌లోని ప్రఖ్యాత గణేశ్ టెంపుల్‌లో అన్నదానం కోసం సగటున నెలకు 60 సిలిండర్ల వాడకం ఉండేది. ప్రస్తుతం 8–10 ఇస్తున్నట్లు సమాచారం. కనీసం 20–30 సిలిండర్ల వరకు ఇవ్వాలని దేవాదాయశాఖ అధికారులు లేఖ రాసినా స్పందన రాలేదు. దాంతో ఇటీవల అన్నదానం నిలిపివేశారు. సికింద్రాబాద్ మహాకాళీ ఆలయంలోనూ అన్నదానం నిలిచిపోయింది. యాదగిరిగుట్టలో నిత్యం 1,500 మంది భక్తులకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నదానం చేసేవారు. ఇప్పుడా సమయాన్ని మధ్యాహ్నం 3 గంటల వరకు కుదించారు.

**సామిల్లులకు భారీగా డిమాండ్**

వాణిజ్య గ్యాస్ కొరతతో హాస్టళ్లు, హోటళ్ల యజమానులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. ఎక్కువ మంది కట్టెల పొయ్యిల వైపు మళ్లారు. హైదరాబాద్‌లోని హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు భారీగా కట్టెలు కొంటుండటంతో సామిల్లులు(కట్టె కోత యంత్రాలు) రోజంతా నడుస్తున్నాయి. "గతంలో నెలంతా కలిపితే కట్టెల అమ్మకం 5 క్వింటాళ్లు దాటకపోయేది. ఇప్పుడు 15 రోజుల్లోనే 50 క్వింటాళ్లకు ఆర్డర్లు వచ్చాయి" అని తూప్రాన్‌కు చెందిన ఓ వ్యాపారి తెలిపారు. మరోవైపు గతంలో క్వింటాకు రూ.600 ఉన్న ధర ప్రస్తుతం రూ.1000కి చేరింది. కట్టెలకు పెరిగిన డిమాండ్, గ్యాస్ కొరత ప్రభావం నిత్యావసరాలపైనా పడుతోంది.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ పన్ను తగ్గింపు

పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధనం ధరలు పెరిగిపోతున్నాయి. చాలాదేశాల్లో ఇంధన అత్యవసర పరిస్థితి విధించారు. పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.10 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేసింది. దీనివల్ల చమురు కంపెనీలపై భారం తగ్గి, రిటైల్ ధరల పెరుగుదలను అరికట్టినట్లు అయ్యిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతుండడంతో మనదేశంలోనూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించడంతో వినియోగదారులపై అదనంగా ఎలాంటి భారం పడబోదని సమాచారం. ప్రస్తుతం పెట్రోల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ పన్ను లీటర్‌కు రూ.13 ఉండగా.. తాజాగా రూ.10 తగ్గించడంతో అది రూ.3కు చేరుకుంది. డీజిల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ పన్ను లీటర్‌కు రూ.10 ఉంది. తగ్గింపు తర్వాత సున్నాకు చేరింది. ఈ తగ్గింపుతో ప్రభుత్వ ఖజానాకు ఏడాదికి రూ.1.75 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపుతో చమురు ధరల పెరుగుదల నుంచి ప్రజలకు రక్షణ లభిస్తుందంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 'ఎక్స్'లో పోస్టుచేశారు.

**రిటైల్ ధరలు యథాతథం**

ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ఆయిల్ కంపెనీలు నష్టపోతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ.24, డీజిల్‌పై లీటర్‌కు రూ.30 చొప్పున నష్టం వస్తోందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి చెప్పారు. ప్రత్యేక అదనపు ఎక్సైజ్ పన్ను తగ్గడంతో ఆయిల్ కంపెనీలు కొంతవరకు కోలుకుంటాయని, నష్టాలు భర్తీ అవుతాయని అధికారులు అంటున్నారు. రిటైల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. అంటే ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు ప్రయోజనం నేరుగా వినియోగదారులకు బదిలీ అయ్యే అవకాశం లేదు. పరోక్షంగానే ప్రయోజనం ఉంటుంది. రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత రిఫైనరీలకు వచ్చిన లాభాల నేపథ్యంలో 2022 జూలైలో తొలిసారిగా ప్రవేశపెట్టి, 2024 డిసెంబర్‌లో ఉపసంహరించుకున్న ఎక్స్‌పోర్టు పన్నును ప్రభుత్వం పునరుద్ధరించింది. డీజిల్‌పై లీటర్‌కు రూ 21.50, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్(ఏటీఎఫ్)పై లీటర్‌కు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకాన్ని(విండ్‌ఫాల్ ట్యాక్స్) విధించింది. అయితే, ఈసారి ఓఎన్జీసీ వంటి సంస్థలు దేశీయంగా ఉత్పత్తి చేసే ముడి చమురుపై ఎలాంటి విండ్‌ఫాల్ పన్ను విధించలేదు.

**ఎన్నికలకోసమే ఈ స్టంట్:కాంగ్రెస్**

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు పట్ల విపక్ష కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వ్యంగ్యంగా స్పందించారు. ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రభుత్వం ఈ స్టంట్‌కు తెరతీసిందని విమర్శించారు. గత 12 ఏళ్లలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు చాలాసార్లు తగ్గాయని, అప్పుడు మన దేశంలో రిటైల్ చమురు ధరలు తగ్గించలేదని చెప్పారు. ఇప్పుడు ఎన్నికలు ఉండడంతో ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. 'ఏప్రిల్ 30 దాకా వెయిట్ చేయండి'అంటూ జైరామ్ రమేశ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఆ తర్వాత రిటైల్ ధరలు పెరుగుతాయని పరోక్షంగా తేలి?చచెప్పారు.

# పెరుగుతున్న ఉద్రిక్తతలు

బహ్రెయిన్, ఖతార్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలపై క్షిపణుల్ని ప్రయోగించింది. మరోవైపు పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి.

**అవి అమెరికాకు ఇచ్చిన కానుకలు : ట్రంప్**

ఇరాన్ తన ఇంధన కేంద్రాలు, చమురు నిల్వలపై దాడులను తప్పించుకోవాలంటే చర్చలు ఒక్కటే మార్గమని చెప్పారు. లేకుంటే వారి ఇంధన కేంద్రాలను నేలమట్టం చేస్తామని హెచ్చరించారు. "హోర్ముజ్ జలసంధి నుంచి ఎనిమిది చమురు నౌకలను వెళ్లేందుకు ఇరాన్ అనుమతించింది. ఇది అమెరికాకు ఇరాన్ ఇచ్చిన 'కానుక' అని చెప్పుకొచ్చారు.

**ఐక్యరాజ్యసమితికి ఇరాన్ లేఖ**

అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. ఆ రెండు దేశాలవి ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదమని అభివర్ణించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఓ లేఖ రాసింది. తమ దేశ సీనియర్ ఉన్నతాధికారులు, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి, పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాగెర్ ఘాలిబాఫ్‌లను హత్య చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ కుట్ర పన్నాయని ఆ లేఖలో పేర్కొంది. ఈ లేఖను ఐక్యరాజ్యసమితి (యూఎన్) సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, యూఎన్ భద్రతా మండలి అధ్యక్షుడికి యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయ్యిద్ ఇరావని గురువారం అందించారు. ఈ వివరాలతో ఇరాన్ అధికారిక న్యూస్ ఛానల్ ఒకటి వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. అమెరికా, ఇజ్రాయిల్‌లు ఉద్దేశపూర్వకంగానే ఈ హత్యలకు పాల్పడుతున్నాయని వివరించింది. ఈ విధంగా కుట్రలు చేయడం అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవేళ ఇరాన్ హై ర్యాంకింగ్ అధికారులపై దాడులు జరిగితే, అది శాంతియుత అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. అరబ్ దేశాల తీరుపై కూడా ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా సైన్యానికి సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సహకారాన్ని అందించడం విచారకరమని పేర్కొంది. ఈ అరబ్ దేశాలు అంతర్జాతీయ చట్టాలను కాలరాస్తున్నాయని వివరించింది. సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు అమెరికాకు సైనికపరమైన ఆశ్రయం ఇవ్వడాన్ని ఆపాలని సూచించింది.

**ఇరాన్‌పై యూఎస్ రహస్య ఆయుధం**

గల్ఫ్ సముద్ర మార్గాల్లో పహారా కోసం తొలిసారిగా మానవరహిత డ్రోన్ స్పీడ్‌బోట్లను మోహరించినట్టు పెంటగాన్ అధికారికంగా ధృవీకరించింది. ఇరాన్ కార్యకలాపాలను అడ్డుకోవడంతో పాటు సముద్ర జలాల్లో నిఘా వ్యవస్థను పటిష్టం చేయటమే లక్ష్యమని పేర్కొంది. అత్యంత వేగంగా ప్రయాణించే ఈ స్పీడ్‌బోట్‌లు శత్రువుల కదలికలను సులువుగా పసిగడతాయని అమెరికా రక్షణ శాఖ తెలిపింది. గతంలో ఉక్రెయిన్ కూడా ఈ తరహా బోట్లనే వాడి రష్యాపై దాడులు చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని అనుసరించి ఇరాన్‌ను దెబ్బతీసేందుకు అమెరికా ప్రణాళికలు రచిస్తుంది. అయితే డ్రోన్ బోట్లలో అనేక వైఫల్యాలు ఉన్నట్టు సమాచారం. వీటిని అమెరికా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదు. గతేడాది జరిగిన పరీక్షల్లో ఓ జీఏఆర్సీ బోట్ వేగంగా వెళ్లి మరో బోట్‌ను ఢకట్టింది. తాజాగా మిడిల్ ఈస్ట్‌లో జరిగిన మరో పరీక్షలో ఓ డ్రోన్ స్పీడ్‌బోట్ పనిచేయకుండా పోయింది. అనేక సాంకేతిక లోపాలు ఈ బోట్లలో ఉన్నాయని ప్రచారం జరుగుతుంది.

**పెరుగుతున్న మృతులు**

పశ్చిమాసియా ఘర్షణల్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటి వరకు 1900 మందికి పైగా మృతి చెందినట్టు తెలుస్తోంది. లెబనాన్‌లో 1,100 మందికి పైగా మృతి చెందినట్టు సమాచారం. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, లెబనాన్‌లో ముగ్గురు ఇజ్రాయెల్ సైనికులు మృతి చెందారు అలాగే అమెరికా బలగాలకు చెందిన 13 మందితో పాటు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నలుగురు, గల్ఫ్ అరబ్ రాష్ట్రాల్లో 20 మంది మృతి చెందినట్టు గణాంకాలు చెప్తున్నాయి.

# సామర్థ్యాలు పెంచుకుందాం..! కలిసి సాగుదాం

'ప్రభుత్వ ఉద్యోగుల్లో పాలనా సామర్థ్యాల్ని బలోపేతం చేసేందుకు ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు సాధన సప్తాహం పేరుతో జాతీయ అభ్యాస వారోత్సవాలు నిర్వహించనుంది. ప్రతి ఉద్యోగి ఒక లక్ష్యంతో ఇందులో చురుగ్గా పాల్గొనడానికి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తప్పనిసరి ఏఐ కోర్సు పూర్తి చేయడానికి ఇదొక గొప్ప అవకాశం. మన సామర్థ్యాల్ని పెంపొందించుకుంటూ.. సంస్థల్ని బలోపేతం చేస్తూ.. ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా కలిసి సాగుదాం' అని ఆకాంక్షించారు.

**రామరాజ్య ఆశయాల్ని ముందుకు తీసుకెళ్తా**

శ్రీరామనవమి సందర్భంగా అయోధ్య రామమందిరాన్ని సందర్శించిన జ్ఞాపకాల్ని సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "ఆ దివ్య మందిరాన్ని, బాలరాముణ్ని దర్శించుకున్న జ్ఞాపకాలు ఎంతో సంతోషానిచ్చాయి. రాముడు నిలబడిన ధర్మం, న్యాయం, క్రమశిక్షణ, నిస్వార్థ సేవ అనే విలువలపై నా నమ్మకం మరింత పెరిగింది. వీటి స్ఫూర్తితో రామరాజ్య ఆశయాల్ని ముందుకు తీసుకెళ్తాను. మన యువత కూడా ఇదే మార్గంలో నడవాలి. గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలి. ఆ రాముడి ఆశీస్సులతో అందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు

# చిత్తశుద్ధి లేదు

రాజకీయ రంగాల్లో బీసీలకు
దక్కాల్సిన వాటా దక్కడం లేదు
ఈ చారిత్రక అన్యాయంపై
పోరాడడానికి సంసిద్ధులు కావాలి
బీసీ హక్కులు సాధించాలంటే
పోరాటం ఒక్కటే మార్గం
గత 79ఏళ్లుగా బీసీలను
కేవలం ఓటు బ్యాంకు కేవలం
రాజకీయాలకు వాడుకుంటున్నారే తప్ప
బీసీల బ్రతుకులు మార్చే చిత్తశుద్ధి
ఏ ప్రభుత్వానికి లేకపోవడం
ఎంతో దురదృష్టకరం.

సామాజిక పరంగా, విద్యాపరంగా
అటు ఆర్థికంగా ఇటు రాజకీయంగా
వెనుకబాటుతనం అనేది
బీసీలకు శాపంగా మారింది
జనాభా పరంగా ముందంజలో
ఉంటున్న బీసీ సామాజిక వర్గాలు
రాజకీయంగా అట్టడుగున ఉన్నారు
లబ్ది పొందే విషయంలో మాత్రం
ఆరెండు కులాలు తప్ప మిగిలిన
అన్ని సామాజిక వర్గాలు ఎంతో
వెనుకబాటు తనంతో ఉన్నాయి.

బీసీలు ఆత్మాభిమానం ఉన్నవాళ్ళు
ఆకలినైనా భరించగలరు
కానీ...అవమానాన్ని మాత్రం
అస్సలు భరించలేరు
అసలు రాజకీయమంటే
వ్యాపారం కాదు, ఉద్యోగం కాదు
అదొక సామాజిక బాధ్యతని
నమ్మగలిగే నిస్వార్ధపరులు.



రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

## ఆర్టీసీలో ప్రైవేటు డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రయాణికులకు ముప్పు



**విజ్ఞాన్ దినపత్రిక పొదలకూరు ::** నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో తిరిగే ఆర్టీసీ వారు నియమించిన ప్రైవేటు డ్రైవర్లు అధిక వేగంతో పోవడం వలన రోడ్ల మీద ఉండే గుంతలు మరియు క్రాసింగ్ ముందుచూపుతో చూడకుండా వారి ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేసుకుంటూ పోతున్నారు ఆర్టీసీ ప్రయాణంలో ఎక్కి ఉండేవారు చాలా ఇబ్బంది పడుతున్నారు ఈ డ్రైవర్ల వల్ల మా ప్రాణానికి ముప్పు ఉందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు డ్రైవర్లకు ఎన్నిసార్లు చెప్పినా నెమ్మదిగా పొమ్మని చెప్పిన పోవడం లేదు ఆర్టీసీ వారు కి హెవీ డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వారిని తీసుకోవడం తప్పులేదు వారికి శిక్షణ ఇవ్వాల్సిందిగా ప్రయాణికులు చెప్పుకుంటున్నారు ఎప్పుడు ఏ క్షణం జరుగుతుందో మాకు అర్థం కావడం లేదు ఆర్టీసీ వారు మా ఆవేదన ఆలోచించి ప్రైవేట్ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ ఇప్పించవలసిందిగా కోరుకుంటున్నారు

## ఘనంగా నవమి వేడుకలు...!

**-వాడ వాడ ల రాములోరి కళ్యాణం**
**-పెద్ద ఎత్తున్న అన్నదానం**



**నెల్లూరు సిటీ.. మార్చ్ 27/.(విజ్ఞాన్ పత్రిక ప్రతి నిధి ).** జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ భక్తజనం జేజేల నడుమ నెల్లూరు నగరం లో శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండుగ లా జరిగాయి చిన్న బజారు లో మువ్వల రాంబాబు ఆధ్వర్యంలో సీతారామకళ్యాణం కన్నుల పండుగ వల్లే జరిగింది పెద్ద ఎత్తున్న భక్తులు పాల్గోని కళ్యాణని తిలకించారు.... కోరడా వీధిలో బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు మారం కృష్ణ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్బంగా సీతారామకళ్యాణం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకురాలు కంది కట్ల రాజేశ్వరి పాల్గొన్నారు తదుపరి భక్తులకు అన్నదానకార్యక్రమం జరిగింది.. బార్కస్ లోని రామాలయం నందు నవమి వేడుకలు జరిగాయి.. సంత పేటరామ భక్త మండలి ఆధ్వర్యంలో సీతా రామ కళ్యాణం జరిగింది.

## ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణను వ్యతిరేకించండి అంటూ సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల

ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ, వెంకటగిరి సిఐటియు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై చేపడుతున్న దాడులు అత్యంత అమానుషమైనవని, ప్రపంచ శాంతికి ముప్పు కలిగిస్తున్నాయని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక నగరాలపై బాంబు దాడులు జరిపి అమాయక ప్రజలను బలి తీసుకోవడం యుద్ధ నేరమని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలపై దాడులు జరిపి విద్యార్థులను హతమార్చడం అత్యంత దారుణమని అన్నారు. అంతర్జాతీయ న్యాయ నిబంధనలను, ఐక్యరాజ్యసమితి సూత్రాలను అమెరికా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం సహజ వనరులను దోచుకునే ఉద్దేశంతోనే ఈ దాడులు చేస్తున్నదని, ఇజ్రాయిల్ జాత్యహంకార విధానాలను ప్రపంచం ఎదిరించాలని అన్నారు.. ప్రపంచ దేశాల మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్న సమయంలో దొంగదెబ్బతీసినట్లుగా యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించడం దురుద్దేశపూరిత చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ దాడులను




ఖండించకుండా మౌనం వహించడం దురదృష్టకరమని, ఇది దేశ సార్వభౌమాధికారానికి విరుద్ధమని తెలిపారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి భారత ప్రజలపై భారీ భారం పడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. అమెరికా--ఇజ్రాయిల్ దురాక్రమణలను ఖండిస్తూ, యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి శాంతి చర్చలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు, అఖిలభారత మహిళా సంఘం వెంకటగిరి మండల కార్యదర్శి సుబ్బలక్ష్మి, సిఐటియు నాయకులు ఎం వి రమణ తదితరులు పాల్గొనడం జరిగింది.కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కాపురం సమీపం లో బస్సు ప్రమాదం లో డ్రైవర్ నిర్లక్ష్యం,బస్సు కండిషన్ లో లేకపోవడం ప్రధాన కారణంగా ప్రాథమికంగా నిర్ధారణ

**-ఇంకా కొనసాగుతున్న దర్యాప్తు**

రోడ్డు మూలమలుపులో మృత్యువు మాటేసింది. ఎదురుగా వస్తున్న టిప్పర్ మీదకు ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లింది. నేరుగా టిప్పర్ డీజిల్ ట్యాంకర్ను ఢీకొట్టింది. అదే సమయంలో బస్సు బ్యాటరీ పేలిపోయింది. వెరసి 14 జీవితాలు నిలువునా కాలి బూడిద అయ్యాయి. హరికృష్ణ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, తప్పిదాలే ఈ ఘోర ప్రమాదానికి కారణమయ్యాయని అగ్నిమాపక, పోలీసు శాఖలు కూడా ప్రాథమికంగా తేల్చాయి. ఘటనా స్థలంలో 'ఎస్' ఆకారంలో మలుపు ఉందని.. అలాంటిచోట అతివేగంగా బస్సు నడుపుతూ రాంగ్ లేన్లోకి వెళ్లిపోవటమే ప్రమాదానికి దారితీసిందని గుర్తించాయి. 'ట్రావెల్స్ బస్సు రాంగ్ లో మితిమీరిన వేగంతో రావడంతో.. ఎదురుగా సరైన లేన్లోనే వస్తున్న టిప్పర్ డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు తన వాహనాన్ని కుడివైపు తిప్పాడు. దీంతో బస్సు వెళ్లి నేరుగా వెళ్లి టిప్పర్ డీజిల్ ట్యాంక్ను ఢీకొట్టింది. అందులోని డీజిల్ బస్సుపైకి చిమ్మటం వల్ల మంటలు చెలరేగి క్షణాల్లో అంతటా వ్యాపించాయి' అని నిర్ధారించాయి. బస్సు డ్రైవర్కు లేన్ సెన్స్ లేకపోవటం, రోడ్డు మార్కింగ్లపైన



అవగాహన కొరవడటం కూడా ప్రమాదానికి కారణలయ్యాలయని పేర్కొన్నాయి. బస్సులో వేగంగా మండే స్వభావం కలిగిన పదార్థాలు ఉండటం కూడా మంటల వ్యాప్తికి కారణమైందని తెలిపాయి. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించాయి. స్టీరింగ్ స్టక్ కావడంతో వాహనాన్ని తాను నియంత్రించలేకపోయానని బస్సుడ్రైవర్ పోలీసు విచారణలో వెల్లడించారు. డ్రైవర్ నిద్రమత్తు వల్లే దుర్ఘటన జరిగి ఉంటుందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## సీతారాముల కళ్యాణ మహోత్సవంలోపాల్గొన జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల దంపతులు

**నెల్లూరుసిటీ.. మర్చి 27/ (విజ్ఞాన్ ప్రతినిధి** శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా, నెల్లూరు నగరంలోని పోలీస్ క్వార్టర్స్ వద్ద గల పురాతన శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో జగదభిరాముడైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా శుక్రవారం నిర్వహించబడింది. ఈ కళ్యాణ మహోత్సవంలో జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల దంపతులు మరియు అడిషనల్ ఎస్.పి (అడ్మిన్) సిహెచ్. సౌజన్య దంపతులు కలిసి పాల్గొన్నారు. వీరు స్వామివారి కళ్యాణంలో పీటలపై కూర్చుని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, మంగళ వాయిద్యాల నాదంతో ఆధ్యాత్మిక వాతావరణంలో కళ్యాణ ఘట్టం కనుల పండువగా సాగింది. జిల్లా ఎస్పీ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన కార్యనిర్వాహక బృందాన్ని, ఆలయ కమిటీ సభ్యులను అభినందిస్తూ, ఈ కళ్యాణంలో పాల్గొన్న పోలీస్ కుటుంబాలందరికీశ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న



బాలలను జిల్లా ఎస్పీ, అడ్మిన్ మేడం సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏ ఎస్పీ, దీక్ష, ఎస్ బీ డీఎస్పీ శ్రీనివాసులు , ఏ ఆర్ డీఎస్పీ శ్రీ చంద్ర మోహన్, చూా చంద్ర మౌళి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్దిపాటి ప్రసాద్, మరియు కార్యనిర్వాహకులు శ్రీ కుమారస్వామి బృందం, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## జాజుల శ్రీనివాసులు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 27** కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం కొత్తపేట గ్రామం లో ఇటీవల మరణించిన జాజుల శ్రీనివాసులు కుటుంబ సభ్యులని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆయన వెంట గుడ్లూరు మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవంతిని పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన మాజీ శాసనసభ్యులు



**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 27** కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం స్వర్ణజిపురం గ్రామం లో ఇటీవల రోడ్డు ప్రమాదం లో గాయపడి ఇంటి వద్ద వున్నా పాలిచర్ల అవంతి ని పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసిన మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ గారు ఆయన వెంట గుడ్లూరు మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుకు గిట్టుబాటు ధర లేక దళారుల చేతిలో మోసపోతున్న రైతు





**విజ్ఞాన పత్రిక పొదలకూరు** నెల్లూరు జిల్లాలో ధాన్యం ధరల పతనంపై రైతులు వద్దకు మిడతల రమేష్ వెళ్లి కారణాలు తెలుసుకున్నారు. నెల్లూరు జిల్లా మరియు పొదలకూరు మండలం లో ని అని గ్రామాలలో రైతులతో ముఖాముఖి మాట్లాడి రైతు ల ఆవేదన తెలుసుకున్నారు. ఏ ప్రభుత్వం ఏ అధికారులు రైతులను ఆదుకునేది లేదని రైతులు చెబుతున్నారు. గ్రామాలలో రైతులుగా పుట్టిన పాపానికి గిట్టుబాటు ధర లేకపోయినా వ్యవసాయాన్ని నమ్ముకుని జీవించాల్సిన పరిస్థితి మాదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు అధికారుల సమావేశాలు పైపైకి మాత్రమేనని క్రింది స్థాయిలో రైతులను దోపిడీ చేస్తే అడ్డుకునే అధికారి కనిపించడం లేదని రైతుల తమ గోడును వెళ్ళబుచ్చారు. పొదలకూరులో రైతు ఆవేదన పై బిజెపి నేత మిడతల రమేష్ మాట్లాడుతూ అధికారులు మిల్లర్లు మధ్య ఏదో తెలియని రహస్య ఒప్పందం ఉందని ఆరోపణ చేశారు. పొదలకూరు మండలంలో అన్ని రకాల ధాన్యం ధరలు దిగజారిపోయి ఉన్నాయని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ధరల పతనంను రైతుల ఆవేదనను ప్రభుత్వ స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని రమేష్ తెలిపారు.

## యధావిధిగా దళితులకు , వారి భూములు వారికి దక్కే వరకు పోరాటం కొనసాగిస్తాం .

**- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ**



నెల్లూరు జిల్లా దగదర్తి మండలం చెన్నూరు గ్రామ దళితులకు చెందిన వ్యవసాయ భూమి ఆక్రమణ చెర నుంచి విడిపించాలని కోరుతూ శుక్రవారం రెండవ రోజు చెన్నూరు లోని ఆ భూముల వద్ద , సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ భూములు కోల్పోయిన స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , గ్రామంలో మాల మాదిగల కు యధావిధిగా ఆ భూములు దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు . జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ చొరవ తీసుకొని విచారణ కమిటీ వేసి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు . దళితుల భూములను అక్రమంగా లాక్కున్న వారిపై చర్యలు చేపట్టి , ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు . దళితుల భూములను ఆక్రమించిన ఓసీలకు గుణపాఠం చెప్పే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు .

## బస్సుప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 27 :** మార్కాపురం వైద్యశాలలో బాధిత కుటుంబాలతో మాట్లాడిన ఎమ్మెల్యే మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ఈ తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదంలో.... వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన బండారు పద్మ చనిపోగా.... పదేళ్ల బాలుడు బండారు రోహన్ కు స్వల్ప గాయాలతో మార్కాపురంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.కందుకూరు శాసనసభ్యులు లిఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం మార్కాపురం ఆసుపత్రికి వెళ్లి మృతురాలు పద్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి రోహన్ తల్లిదండ్రులతో మాట్లాడారు. అక్కడే డ్యూటీ డాక్టర్లతోనూ ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడి ట్రీట్మెంట్ గురించి అరా తీశారు. ఇతర ప్రాంతాల బాధితులతో ఎమ్మెల్యే మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సొంతగా ఆర్థిక సహాయం అందజేశారు. డిఎన్ఏ పరీక్షల అనంతరం శనివారం సాయంత్రం మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని వైద్యశాల డాక్టర్లు ఎమ్మెల్యేకు తెలిపారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం వీలైనంత త్వరగా బాధితులకు అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంట అంకభూపాలపురం టిడిపి నాయకులు పెగడ శ్రీను, బండారు సోమరాజు ఉన్నారు.

## అవంతిని పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన మాజీ శాసనసభ్యులు



**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 27** కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం స్వర్ణజిపురం గ్రామం లో ఇటీవల రోడ్డు ప్రమాదం లో గాయపడి ఇంటి వద్ద వున్నా పాలిచర్ల అవంతి ని పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసిన మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ గారు ఆయన వెంట గుడ్లూరు మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఎన్టీఆర్ గారి విగ్రహ ఏర్పాటు మరియు భూమి పూజ

**ఏసిపోగు బాబు విజ్ఞాన దినపత్రిక విలేకరి.ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలో రవితేజ కల్యాణమండపంలో ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి అధ్యక్షతన టిడిపి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగింది.. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిధిలుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు మరియు టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి పాల్గొని ప్రసంగించడం జరిగింది. వారు మాట్లాడుతూ...సమాజమే దేవాలయంది ప్రజలే దేవుళ్ళుగాళీళీళీ నమ్మే మన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొన్ని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి విజనరీ నాయకత్వాన్నిమ్మరియు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువ నాయకులు శ్రీ నారా లోకేష్ గారి ప్రగతిశీల కృషిన్ని ఘనంగా తెలియజేసేందుకు తెలుగుజాతి వెలుగుతేజం యుగపురుషుడు స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు గారి స్మృత్యర్థంగా్ను ఆత్మకూరు నియోజకవర్గం లోని బైపాస్ రోడ్డు-రెసిడెన్షియల్ స్కూలు సమీపాన్ను స్వర్గీయ ఎన్టీఆర్ గారి విగ్రహ ఏర్పాటుకు "భూమి పూజ మరియు శంకుస్థాపన".జరుగును. అనంతరంపార్టీ క్యాడర్ తో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సభ జరుగును.అదేవిదంగా తేదీ 29.03.2026 ఆదివారం ఉదయం 10:30 గం.లకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు



శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారితో పాటు పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొంటారు. కావున ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని బూత్ స్థాయి, గ్రామస్థాయి, యూనిట్ స్థాయి, క్లస్టర్ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి బాధ్యులు,నేతలతో పాటు అందరూ ప్రజా ప్రతినిధులు, సాగునీటి సంఘాల, వ్యవసాయ సహకార పరపతి సంఘాల, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీల ప్రతినిధులంతా తప్పక పాల్గొనాల్సినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమం లో ఆత్మకూరు పట్టణటిడిపి ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాజీ మునిసిపల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సర్దార్, మాజీ కార్పొరేటర్ గౌస్ బాష, ఆత్మకూరు పట్టణ 17 వ వార్డ్ టిడిపి పార్టీ ఇంచార్జి ఒంటెరు మల్లికార్జున నాయుకులు తాటిపర్తి పెంచలయ్య మాజీ కౌన్సిలర్ కొండా నాగభూషణమ్మ, ఆత్మకూరు గురుకుల బాలికల హాస్టల్స్ చైర్మన్ ఉదయగిరి బాలకృష్ణ టిడిపి నాయుకులు పాల్గొనడం జరిగింది.

## వైభవంగా శ్రీ అంకమ్మ తల్లి అభిషేకం పల్లకి సేవ





**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్)** కందుకూరు నియోజక వర్గంలోని గ్రామదేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి అభిషేకం శుక్రవారం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తాత జలేంద్ర, అమరేంద్ర, ఫణీంద్ర వారి కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. సాయంత్రం మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణం ఆలపించారు. రాత్రి పల్లకి సేవ ఎంతో వైభవంగా జరిగింది. పల్లకి సేవ ముందు కోలాటం వారు, శ్రీ సరస్వతి నిలయం నటరాజనాట్యమండలి వారు అమ్మవారి పల్లకి సేవ ముందు కోలాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీ సీతారాముల కళ్యాణం



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 27** కందుకూరు నియోజకవర్గంలోని శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కందుకూరు పట్టణంలోని ముదిరాజ్ పాలెంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కన్నులపండువగా జరిగింది. బుధవారం ఉదయం నుంచే ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. రంగురంగుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన కళ్యాణ మండపంలో సీతమ్మ వారు, రామచంద్రమూర్తిల ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద మంత్రాల సాక్షిగా కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకను వీక్షించేందుకు ముదిరాజ్ పాలెం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా, పట్టణం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముదిరాజ్ పాలెం లోని వీధులన్నీ శ్రీరామ జయరామ నామస్మరణతో మారుమోగాయి. స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఈ వేడుకను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు వారివారి కుటుంబాలలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, లోకమంతా శాంతిగా ఉండాలని ఆ రామయ్యను ప్రార్థించుకున్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామివారి అన్న ప్రసాదం మరియు చల్లని పానకం, వడపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు, కళ్యానోత్సవ పిటలపై తగిలాం అరవింద్ - సుప్రజ మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గున్నారు

## శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రమాదేవి బిజెపి నాయకురాలు



కందికట్ల రాజేశ్వరి నెల్లూరు నగరంలోని స్థానిక 45 వ వార్డులో జేమ్స్ గార్డెన్ లో అత్యంత వైభవోపేతంగా శ్రీ రాములవారి కళ్యాణం వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రమాదేవి బిజెపి నాయకురాలు కందికట్ల రాజేశ్వరి పాల్గొని ముందుగా ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈ పవిత్రమైన రోజున సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను అనిమున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రమాదేవి తెలిపారు. "రామో విగ్రహవాన్ ధర్మః" అనే వాక్యం మనందరికీ తెలిసినదే... శ్రీరాముడు ధర్మానికి సజీవ రూపం. ఆయన జీవితం మనకు నిజాయితీ, కర్తవ్యబోధ, త్యాగం, న్యాయం వంటి విలువలను నేర్పుతుంది. శ్రీ సీతారాముల కళ్యాణం కేవలం ఒక ఆచారం కాదు... అది మన కుటుంబ



వ్యవస్థకు, మన సంస్కృతికి, మన సంప్రదాయాలకు ప్రతీక. సీతమ్మ సహనం, శ్రీరాముడి నిబద్ధత -- ఇవి ప్రతి కుటుంబం అనుసరించాల్సిన ఆదర్శాలు అని ఆమె తెలియజేశారు.45 వ వార్డులో జేమ్స్ గార్డెన్ లో అత్యంత వైభవోపేతంగా రాములవారి కళ్యాణం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రమాదేవి బిజెపి నాయకులు రాజేశ్వరి కందికట్ల ఇండ్ల రాఘవేంద్ర జనసేన నాయకులు గురుకుల కిషోర్ విజయలక్ష్మి తెలుగుదేశం నాయకులు ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## దేశవ్యాప్త లాక్‌డౌన్ : కేంద్ర మంత్రి



దేశంలో దేశవ్యాప్త లాక్‌డౌన్ విధిస్తారన్న వదంతులు నెట్టింట బాగా సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోవిడ్ లాంటి సంక్షోభం మనముందుంది, అందరం సన్నద్ధంగా ఉండాలి, కలిసికట్టుగా దీన్ని అధిగమించాలన్న వ్యాఖ్యలు, ప్రపంచవ్యాప్త చమురు, గ్యాస్ కొరత నేపథ్యంలో దేశంలో లాక్‌డౌన్ మళ్లీ తప్పదనే పుకార్లు షికార్లు చేశాయి. దీనిపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి శుక్రవారం వివరణ ఇచ్చారు. ప్రభుత్వం పరిశీలనలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. దేశవ్యాప్త లాక్‌డౌన్ వదంతులు పూర్తిగా అవాస్తవమని ఎక్స్‌లో క్లారిటీ ఇచ్చారు. గ్లోబల్ పరిస్థితులు మారుతున్నప్పటికీ, ఇంధనం, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రపంచ పరిస్థితి నిరంతరం మారుతూనే ఉంది. ఇంధనం, సరఫరా గొలుసులు, నిత్యావసర వస్తువుల రంగాలలో జరుగుతున్న పరిణామాలు, ముఖ్యంగా న్రా+ సరఫరాపై లాక్‌డౌన్ ఆందోళనలు వ్యక్తమవడంతో కేంద్రమంత్రి ఈ వివరణ ఇచ్చారు.

## రోడ్డు భద్రతపై అప్రమత్తం కావాలి : ఎస్సై వెంకట్ విజ్ఞప్తి

-ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ స్టాపర్లు... వాహనదారులకు సూచనలు

-బైపాస్ రహదారులపై వేగం, రాంగ్ రూట్‌కు బ్రేక్ వేయాలి

-ప్రాణాల కంటే వేగం గొప్పది కాదు





**మంగళగిరి మార్చి 27** మంగళగిరి పడమర బైపాస్‌పై చోటుచేసుకున్న విషాదకర రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై మంగళగిరి పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకట్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రమాద స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్సై వెంకట్, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వల్లనే ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్ నియమాలను అతిక్రమించరాదని సూచించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతూ, సంబంధిత అధికారులతో కలిసి రహదారిపై ట్రాఫిక్ స్టాపర్లను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.ముఖ్యంగా బైపాస్ రహదారులపై నియంత్రణ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతోందని ఆయన అన్నారు..ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో ప్రయాణించకూడదని హితవు పలికారు. ద్విచక్ర వాహన చోదకులు జాతీయ రహదారిపై ప్రయాణించకుండా, నిబంధనల ప్రకారం సర్వీస్ రోడ్డుపై రాకపోకలు సాగించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, ప్రతి వాహనదారు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించి నియమాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నదే తమ లక్ష్యమని ఎస్సై వెంకట్ స్పష్టం చేశారు.

## రూ.400 కోట్లకు పైగా నగదు స్వాధీనం

ఎన్నికల ప్రచారం వేళ అక్రమ నగదు, మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఉక్కుపాదం మోపుతోంది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఉప ఎన్నికల్లో ప్రలోభాలకు తావులేకుండా ఈసీ కఠిన చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 26న ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్) పేరిట ఎన్నికల నిఘా వ్యవస్థను క్రియాశీలకం చేసింది. నాటి నుంచి మార్చి 25 వరకు కొద్దిరోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.408.82 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మొత్తంలో మాదకద్రవ్యాల విలువ రూ.167 కోట్లకు పైగా ఉండటం గమనార్హం. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలిస్తున్న అక్రమ సొత్తును ఈసీ గణాంకాలతో సహా వెల్లడించింది.

**100 నిమిషాల్లోనే పరిష్కారం :** ఎన్నికల అక్రమాలపై సామాన్య పౌరులు ఫిర్యాదు చేసేందుకు తీసుకొచ్చిన 'సి--విజిల్' (ఎు×+×ూ) యాప్‌కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని ఈసీ తెలిపింది. మార్చి 15 నుంచి 25 మధ్య కేవలం పది రోజుల్లోనే 70,944 ఫిర్యాదులు అందాయి. ఇందులో 95.8 శాతం (67,899) ఫిర్యాదులను కేవలం 100 నిమిషాల వ్యవధిలోనే పరిష్కరించారు. 1950 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని ఈసీ పేర్కొంది.

## 60 రోజులకు సరిపడా ముడి చమురు సిద్ధం

**ఇంధన నిల్వలు పుష్కలం**

**తప్పుడు ప్రచారాలపై కేంద్రం సీరియస్**

దేశంలో ఇంధన సరఫరాపై సాగుతున్న వదంతులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. భారత్‌లో పెట్రోలియం, ఎల్‌పీజీ సరఫరా పూర్తిగా సురక్షితంగా, నియంత్రణలో ఉందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దేశవ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని భరోసా ఇచ్చింది.

**వదంతులు నమ్మొద్దు..**

సోషల్ మీడియాలో ఇంధన కొరతపై జరుగుతున్న ప్రచారాన్ని మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇతర దేశాల్లోని క్యూలైన్లు, పాత లాక్‌డౌన్ దృశ్యాలను వాడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని హెచ్చరించింది. ఇటువంటి వార్తలను నమ్మి పౌరులు ఆందోళన చెందవద్దని, ఇంధన నిల్వలు నిండుగా ఉన్నాయని పేర్కొంది. కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రాబోయే 60 రోజులకు సరిపడా ముడి చమురును కంపెనీలు ఇప్పటికే సేకరించాయి. రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా దేశవ్యాప్తంగా 1 లక్షకు పైగా పెట్రోల్ బంకులు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నాయి. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి 8,00,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ సరుకు సముద్ర మార్గంలో భారత్‌కు వస్తోంది. భారతీయ రిఫైనరీలు ప్రస్తుతం 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ భారత్ ఇంధన భద్రతలో పటిష్టంగా ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒకప్పుడు కేవలం పశ్చిమాసియాపైనే ఆధారపడిన భారత్, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 41కి పైగా దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల హార్మూజ్ జలసంధి వంటి ప్రాంతాల్లో అంతరాయాలు కలిగినా దేశీయ సరఫరాకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని స్పష్టం చేసింది.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.